కోలుకుంటున్న మిర్చితోటలు

- గతేడాది కాసులు కురిపించిన మిర్చిసాగు..
- ఇటీవలి వరదలకు దెబ్బతిన్న మిర్చితోటలు
- ప్రస్తుతం జీవం పోసుకున్న మిర్చి పంట
- దిగుబడులు, లాభాలపై ఆశగా రైతులు


కంచికచర్ల మండలం గండేపల్లిలో సాగవుతున్న మిర్చి పంట


చీడపీడలను నివారణకు నీలిమందును పిచికారీ చేస్తున్న కార్మికుడు

కంచికచర్ల: గతేడాది కాసుల వర్షం కురిపించిన మిర్చిసాగులో ఈసారి కూడా దిగుబడులు పెరిగి లాభాలు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ఇటీవల వరదలకు దెబ్బతిన్న మిర్చితోటలు, ప్రస్తుతం వాతావరణం అనుకూలించటంతో కోలుకుంటున్నాయి. గతేడాది మాదిరిగా ఆశించిన మేర దిగుబడులతోపాటు గిట్టుబాటు ధర లభిస్తే, వరదల నష్టం నుంచి కొంతమేరకైనా కోలుకుంటామని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

20,384ఎకరాల్లో మిర్చిసాగు...

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో రైతులు సుమారు 20,384 వేల ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. గతేడాది ఈ రెండు నియోజకవర్గాల్లో 45వేల ఎకరాల్లో సాగుచేశారు. కాని మిర్చి సాగువిస్తీర్ణం ఈ ఏడాదికి సగానికి పడిపోయింది. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో మిర్చిసాగు రైతులు చేపట్టారు. వరదలకు మిర్చి తోటలు దెబ్బతినగా, మిగిలిన పంటను రైతులు కాపాడుకున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా చెదురుముదురుగా కురుస్తున్న వర్షాలకు ప్రస్తుతం మిర్చి పంటలు జీవం పోసుకున్నాయి. ఈసారి ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల మేర దిగుబడి రావచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గతేడాదితో పోల్చితే తక్కువగా ధర..

నాణ్యత ఆధారంగా గతేడాది మిర్చి సుమారు రూ.17వేల నుంచి రూ.18వేల వరకు పలికింది. కాని ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చి ధర క్వింటాకు రూ.11వేలు మాత్రమే ఉందని రైతులు చెబుతున్నారు. గతేడాది ఎకరాకు విత్తనం రకం ఆధారంగా 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అయితే ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో భారీగా వర్షాలు, వరదలు సంభవించడంతో మిరపచేలు దెబ్బతిన్నాయి. దీంతో మిర్చి పంట దిగుబడిపై రైతులు దిగాలు చెందారు. ఇటీ ఇటీవల కురిసిన వర్షాలకు మిగిలిన మిర్చితోటలు జీవం పోసుకోవడంతో రైతులు కొంతమేర ఆశాజనకంగా ఉన్నారు. కాని మిర్చి ధర గతేడాదితో పోల్చితే 30శాతం మేర తక్కువగా ఉండటంతో తీవ్రంగా నిరాశ చెందుతున్నారు. ఎకరాకు సుమారు 20క్వింటాళ్ల వరకు దిగుబడి రావడంతోపాటు ధర కూడా గతేడాది మాదిరిగా ఉంటేనే గట్టెక్కగలమని, లేనిపక్షంలో నష్టాలు తప్పవని రైతులు చెబుతున్నారు.

లింగాకర్షక బుట్టలు ఇవ్వని ప్రభుత్వం..

ప్రస్తుతం మిర్చి పంట పూత దశలో ఉంది. పంటలో కొన్నిచోట్ల ఆకుముడత, బొబ్బర, ముడత తెగుళ్ల కనిపిస్తున్నాయి.తెగుళ్లు ఆశిస్తే తాలు ఎక్కువై దిగుబడి కూడా తగ్గిపోతుంది. తెగుళ్లు ఆశించకుండా రైతులు మిర్చితోటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతుండగా, ఈ బుట్టలను రాష్ట్రప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు అందజేయడం లేదు. దీంతో మిర్చిలో తెగుళ్లు ఆశిస్తున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు స్పందించి మిర్చి తోటల కోసం లింగాకర్షక బుట్టలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏడెకరాల్లో మిర్చి సాగుచేశా



ఈ ఏడాది మిర్చి పంటను ఏడెకరాల్లో సాగుచేసా. ఇటీవల కురిసిన భారీవర్షానికి కొంతమేర పంట దెబ్బతింది. మిగిలిన పంటను కాపాడుకోవడానికి నీలిమందులు పిచికారీ చేయడంతోపాటు అవసరమైన ఎరువులను వేస్తున్నా. మంచి దిగుబడులు వస్తున్నాయని ఆశిస్తున్నా. గతేడాది మిర్చి సాగులో ఎకరానికి 16 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధర కూడా బాగానే ఉంది . అందుకే ఈ ఏడాది కూడా మిర్చిపంటను సాగుచేశా.

–బెల్లంకొండ వెంకటసుబ్బారావు, రైతు, గండేపల్లి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నందిగామ నియోజకవర్గంలో రైతులు ఈఏడాది 10,100ఎకరాల్లో మిర్చి సాగు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు మిర్చిలో తెల్లదోమ, తామర పురుగు ఎక్కువగా ఉంది. సూక్ష్మ పోషకాల లోపం కారణంగా తెగుళ్లు ఆశిస్తున్నాయి. తెగుళ్ల నివారణకు సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని పాటించాలి. 1లీటర్ నీటిలో ఫార్ములా–6ను ఐదు గ్రాములు కలిపి 10 నుంచి 15రోజుల వ్యవధిలో 3నుంచి 4సార్లు పిచికారీ చేసుకుంటే మిర్చిపంటలో తెగుళ్లను నివారించుకోవచ్చు.

–వి.నీలిమ, ఉద్యానశాఖ అధికారి, కంచికచర్ల

సమావేశానికి తరలిరండి : తన్నీరు



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడుగా దేవినేని అవినాష్ ఆదివారం బాధ్యతల స్వీకరణ కార్యక్రమంతో పాటు పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి అందరూ తరలిరావాలని ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. విజయవాడ బెంజ్‌సర్కిల్‌లోని శేషసాయి కళ్యాణ మండపంలో ఉదయం 9గంటలకు నిర్వహించే కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, సోషల్ మీడియా మిత్రులు, కార్యకర్తలంతా హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రామసభకు 20 అర్జీలు

త్రిపురవరం(జగ్గయ్యపేట): మండలంలోని త్రిపురవరం గ్రామంలో శనివారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ అనూష్ మాట్లాడుతూ గ్రామాల్లో భూముల సరిహద్దు సమస్యలు, అడంగల్‌లో తప్పులు, సర్వేలో లోపాలున్నా సభలో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామస్తులు 20 అర్జీలను అందజేశారు. గ్రామసభలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేట ఎస్ఐగా జి.రాజు బాధ్యతల స్వీకారం



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ఎస్ఐ–1గా జి.రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో పనిచేస్తూ బదిలీపై ఆయనకు ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

5 నుంచి గ్రామసభలు

వత్సవాయి: మండలంలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 5వతేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎస్.నరసింహరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వతేదీన దేచుపాలెం, 6న చిన్నమోదుగపల్లి, 7న పోచవరం, 8న పెద్దమోదుగపల్లి, 11న గంగవల్లి, 12న చిట్టేల శివారు హస్నాబాద్, 13న వీరభద్రునిపాలెం, 14న రెబ్బవరం, 15వతేదీన వేమవరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. భూముల విస్తీర్ణంలో తేడాలు, ఖాతా నంబర్లు, ఇతర భూ సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని సూచించారు. భూయజయానులంతా ఈ గ్రామసభల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

వత్సవాయి: ప్రభుత్వం అందించే సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచించారు. మండలంలోని 12 గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.6.60లక్షల విలువగల చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, నాయకులు పెద్ది రామారావు, నెల్లూరి శ్రీను, చిట్టూరి రమేష్, సుభాష్, చావా నాగేశ్వరరావు, ఆవుల రామారావు, ఏపూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్: మండలంలోని ఏటిపట్టు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.6.12లక్షల చెక్కులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శనివారం మాగల్లులో అందజేశారు. ఆయా గ్రామాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు ప్రారంభం



చందర్లపాడు(నందిగామటౌన్): చందర్లపాడు మండలంలోని చందర్లపాడు–పొక్కునూరు ప్రధాన రహదారి మరమ్మతు పనులను శనివారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాగల్లులో...

నందిగామ మండలంలోని మాగల్లు–జొన్నలగడ్డ రహదారి మరమ్మతు పనులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, భాస్కరరావు, సాంబశివరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25మంది వాహనదారులకు జరిమానా



కంచికచర్ల : వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు విధిగా సంబంధితపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని ఎస్ఐ బోనగిరి రాజు సూచించారు. 100కుపైగా వాహనాలను తనిఖీ చేసి సరైన ధ్రువీకరణపత్రాలు లేని 25మంది వాహనదారులకు జరిమానా విధించారు. కంచికచర్ల అంబేద్కర్ సెంటర్‌లో శనివారం ఆయన వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తగిన ధ్రువీకరణపత్రాలు అందుబాటులో లేకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు తప్పకుండా పాటించాలని సూచించారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ వై.వేణు, కానిస్టేబుళ్లు గ్రేస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీఏఏ, ఎంపీఈవోలకు శిక్షణ



జగ్గయ్యపేట: పత్తిసాగు రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించేలా వీఏఏ, ఎంపీఈవోలు వారికి అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మాధవీలత సూచించారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల స్థాయిలో వీఏఏ, ఎంపీఈవోలకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా మాధవీలత మాట్లాడుతూ అన్ని గ్రామాలలో పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండలంలోని షేర్‌మహ్మద్‌పేటలో సాగవుతున్న వరి, పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ భవానీ, ఏవోలు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులకు పోలీసుల సూచనలు


బ్యాంకు ఉద్యోగికి సూచనల పట్టికను అందజేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వెంకటేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: సైబర్ నేరాల బారినపడకుండా బ్యాంకు ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. సీఐ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం పట్టణంలో ఉన్న 14 బ్యాంకులను సందర్శించి సైబర్ నేరాల జరిగే తీరు, అప్రమత్తంగా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్తలపై బ్యాంకు సిబ్బందికి అవగాహన కల్పించారు. బ్యాంకు వినియోగదారులతో మాట్లాడి సైబర్ నేరాలు జరిగే తీరు, పాటించాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. సైబర్ నేరాల నిరోధించడానికి పాటించాల్సిన జాగ్రత్తలపై పోలీస్ కమిషనరేట్ వారు రూపొందించిన తెలుగు అనువాద పట్టికను ఆయా బ్యాంకుల మేనేజర్లు, ఉద్యోగులు, సిబ్బందికి అందజేశారు. బ్యాంకుల్లోని వినియోగదారులకు ఉపయోగపడేలా నోటీసుబోర్డుల్లో పెట్టించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాల బారినపడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులను అప్రమత్తం చేస్తూ బ్యాంకు మేనేజర్లంతా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. పట్టణ ఎస్ఐ–2 వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెటర్లకు అభినందన



వరుణ్, రాజేష్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే

జగ్గయ్యపేట అర్బన్: అండర్–19 మల్టీడేస్ క్రికెట్ ఆంధ్రా జట్టుకు ఎంపికైన పట్టణానికి చెందిన వరుణ్ సాత్విక్, రాజేష్‌లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శనివారం అభినందించారు.స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలోని బీవీ సాగర్ మెమోరియల్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోషియేషన్‌లో నెట్స్ వద్ద ప్రాక్టీస్ చేస్తున్న టి.వరుణ్ సాత్విక్, ఎస్.రాజేష్‌లను ఎమ్మెల్యే రాజగోపాల్ కలిసి అభినందించారు. ఈనెల 6నుంచి జరుగనున్న ట్రోఫీలో ఆంధ్రా జట్టుకు వరుణ్ సాత్విక్, రాజేష్ ఆడతారని కోచ్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. క్రికెటర్లను అభినందించినవారిలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, టీడీపీ నాయకులు మైనేని రాధా, సుధీర్, జానీ, సూర సతీష్ ఉన్నారు.

విలియంపేటలో పర్యటించిన ఎమ్మెల్యే

జగ్గయ్యపేట పట్టణంలోని 14వ వార్డు విలియంపేటలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) శనివారం అధికారులు, నాయకులతో కలిసి పర్యటించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగితెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, కౌన్సిలర్ నకిరికంటి వెంకట్, స్థానిక నాయకులు మల్లెల కొండ, మారేపల్లి బాషా, మల్లెల కనకరాజు, సురేష్, అడపా సత్యం, కాసర్ల సైదులు, బి.దానియేలు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లు పరిశీలించిన డీసీపీ


ఇసుక రీచ్‌లు పరిశీలిస్తున్న డీసీపీ మహేశ్వరరాజు

శనగపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని ఇసుక రీచ్‌లను శనివారం డీసీపీ మహేశ్వరరాజు పరిశీలించారు. శనగపాడు, వెంగనాయకునిపాలెం, సుబ్బాయిగూడెం రీచ్‌లను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టారీత్యా నేరం

బాలల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ జాన్సన్


మాట్లాడుతున్న జాన్సన్

తిరువూరు: 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహం చేయడం చట్ట రీత్యా నేరమని, ఈ వివాహాలు చెల్లనేరవని బాలల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ జాన్సన్ అన్నారు. తిరువూరు షాదీఖానాలో శనివారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిరోధంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాన్సన్ మాట్లాడుతూ ఆడపిల్లలపై తల్లిదండ్రులు వివక్ష చూపరాదని, వారికి కూడా చదువుకునే హక్కు ఉందని చెప్పారు. వారిని మైనార్టీ తీరేవరకు చదివించాలని సూచించారు. బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై పోక్సో చట్టం కింద తీసుకునే చర్యలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు. తిరువూరు మండల విద్యా శాఖాధికారి శ్యాంసుందర్, ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి, సహాయ సాంఘిక సంక్షేమాధికారి గాయత్రి మాట్లాడుతూ పలు చట్టాలను వివరించారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారిని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సమీపంలోని ట్రస్ట్ నిర్వహిస్తున్న గోశాలను సందర్శించి గోపూజ చేశారు. గోవులకు ఏడాదిపాటు అవసరమయ్యే పశుగ్రాసాన్ని విరాళంగా అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పూర్తి



కొల్లికుళ్ల(పెనుగంచిప్రోలు): మండలంలోని కొల్లికుళ్ల తాగునీటి పథకానికి సంబంధించి మునేరులో చేపట్టిన పైపులైన్ పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదలకు పైపులైన్ కొట్టుకుపోవటంతో తాగునీటి సరఫరా నిలిచి పోయింది. మునేరులో నీరు ఎక్కువగా ఉండటంతో కొంత జాప్యం జరిగినా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ పనులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు తాగునీరు అందించలేక పోతున్నామని నిర్వాహకులు చెబుతున్నారు.

వీఆర్వోలతో సమావేశం

వీరులపాడు: వీఆర్వోల పనితీరుపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హుస్సేన్ హెచ్చరించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో శనివారం ఆయన మండలంలోని వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలు అవినీతికి పాల్పడినా, విధి నిర్వహణలో అలసత్వం వహించినా సహించేది లేదన్నారు. గ్రామాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు.

యువతి అదృశ్యంపై కేసు

మునునూరు: యువతి అదృశ్యంపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అక్కిరెడ్డిగూడెంకు చెందిన యువతి (19) ఈనెల ఒకటో తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాలి



మైలవరం: విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సరళకుమారి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఫన్‌టాస్టెక్–2కే 24 కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్సీ విభాగం ప్రొఫెసర్ సీహెచ్ నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా టెక్ చెరార్డ్స్, టెక్ ట్రెజర్ హంట్, పిక్చర్ పర్‌ఫెక్ట్ మెమోరీ టెస్ట్, పోస్టర్ ప్రజంటేషన్, సీఎస్ ట్రానియా పెయింటింగ్, డిబేట్స్, స్లిప్ పర్సనాలిటీ తదితర అంశాలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు, సిబ్బంది, ఇతర కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజయవాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంప్స్‌గా నిలిచారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జగ్గయ్యపేట ఎంపీడీవో నితిన్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో నితిన్ హెచ్చరించారు. జగ్గయ్యపేట మండలంలో పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేసే వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 30మంది సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది నుంచి శనివారం ఆయన సంజాయిషీ తీసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ మరోసారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ..

మండలంలోని బూదవాడ, అన్నవరం గ్రామ సచివాలయాలను ఎంపీడీవో నితిన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల సర్వీస్ రిజిష్టరు పరిశీలించి పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్కిల్ సర్వేపై సిబ్బందికి అవగాహన..

మండలంలో ఈనెల 4వతేదీ నుంచి నిర్వహించనున్న స్కిల్ సర్వేపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీవో నితిన్ మాట్లాడుతూ సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబసభ్యుల వివరాలను నైపుణ్య యాప్‌లు నమోదు చేయాలని ఆదేశించారు.అన్ని గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తికమాస పూజలు


కోటిలింగాలలో పంచముఖ అమృతలింగేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు


ప్రత్యేకాలంకరణలో శంభులింగేశ్వరస్వామి

నందిగామటౌన్: కార్తికమాసం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని శైవాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే పుణ్యస్నానాలాచరించి శివాలయాల్లో స్వామివారి దర్శనానికి బారులు తీరారు. మండలంలోని దాములూరు కూడలి గ్రామంలోని సంగమేశ్వరస్వామి, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, పల్లగిరి, నందిగామ పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. పంచామృతాభిషేకాలు, బిళ్వపుష్ప అర్చనాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి వారికి పలు రకాల పండ్ల రసాలతో ప్రత్యేకంగా అభిషేకం చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: కార్తికమాసం ప్రారంభం కావడంతో జగ్గయ్యపేట మండలంలోని పలు శైవక్షేత్రాలు భక్తులతో శనివారం కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముక్త్యాల సమీపంలోని కోటిలింగాల పంచముఖ అమృతలింగేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి వారి కొండపై ఉన్న శివాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.